క్లుప్తంగా

విద్యుత్ అధికారుల పొలంబాట



పొలంబాటలో విద్యుత్ అధికారులు

సైదాపూర్: మండలంలోని వెన్కెపల్లి, దుద్దెనపల్లి గ్రామాల్లో విద్యుత్ అధికారులు శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎలాంటి సమస్యలున్నా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ మోటార్ల కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ కే. శ్రీనివాస్, సిబ్బంది సుధాకర్, సదయ్య, ఆదిబాబు, జగన్, కుమార్‌లు ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్



స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేస్తున్న లక్ష్మణ్‌రావు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కొండం మల్లారెడ్డి స్పోర్ట్స్ డ్రెస్ బహూకరించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు విద్యార్థులకు పంపిణీ చేశారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మల్లారెడ్డి విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోత్స్న, శంకర్, రమాదేవి, షర్మిల, కవిత, చంద్రశేఖర్, జ్యోతి, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

డిక్షనరీలు..



డిక్షనరీలు పంపిణీ చేస్తున్నన రాములు


చిగురుమామిడి: చిగురుమామిడి ఆదర్శపాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం చేతిరాతపై పోటీలు నిర్వహించారు. హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టగా విద్యార్థులు కౌశిక్, కావ్యశ్రీ, మేఘశ్రీ, విద్యాహర్షిత్, స్వాతిక, అశ్వంత్‌రెడ్డి, అనుశ్రీ, రోహిణి, స్పందన, అక్షిత ప్రతిభ కనబరిచారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ రాములు విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలను బహూకరించారు. కార్యక్రమంలో ఇర్షాద్‌అలీ, వేణు, నవీన్, ఝాన్సీ, కళ్యాణి, గంగిశెట్టి మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు జగదీశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడిగె లహరి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికవ్వడం హర్షణీయమని ఉపాధ్యాయుడు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు హన్మాండ్ల భాస్కర్ అన్నారు. శుక్రవారం లహరిని అభినందించారు. 18 నుంచి 20 వరకు మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం తిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ఆటలతో శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ మునీందర్ తెలిపారు. గుంటి శ్రీనిధి, తూడి అక్షర, తూడి ప్రకాయ్, కమటం అద్వైత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, క్రీడాకారులను మునీందర్, హెచ్‌ఎం రాధ, కరాటే మాస్టార్ సుంకె రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు దీపావళి



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్, రామడుగు విన్నర్స్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు పూజలు నిర్వహించి, స్వీట్లు పంపిణీ చేసుకుంటూ టపాసులు కాల్చారు. కార్యక్రమంలో విన్నర్స్ స్కూల్ కరస్పాండెంట్ పంజాల జగన్మోహన్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

మానకొండూర్‌రూరల్/గంగాధర/వీణవంక/చొప్పదండి/గన్నేరువరం: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ ఆయా మండల కేంద్రాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

యాసంగి సాగు ప్రశ్నార్థకం

- ఎస్సారెస్పీ ఉపకాల్వల్లో చెత్తాచెదారం
- పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో ఆనవాళ్లు కోల్పోతున్న వైనం
- సంబంధిత అధికారులు స్పందించాలంటున్న రైతులు
- చివరి ఆయకట్టుకు నీరు అందేనా?



బేతిగల్‌లో కాలువ ఆనవాళ్లు కనిపించకుండా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు ఎస్సారెస్పీ కెనాల్ వరప్రదాయిని. సగానికి పైగా వ్యవసాయ భూములకు ఈ కాల్వ ద్వారా నీరు అందుతుంది. నవంబర్ చివరి నుంచి యాసంగి నారుమడులకు రైతులు సిద్ధమవుతున్నారు. ఉపకాల్వలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో యాసంగి సాగుకు ప్రశ్నార్థకంగా మారింది. చివరి ఆయకట్టుకు నీరు అందుతుందో లేదోనని ఇప్పటి నుంచే రైతులు కలవరపడుతున్నారు. రెండేళ్లుగా కెనాల్‌కు మొదట ఉన్న రైతులు మాత్రమే లబ్ధిపొందుతున్నారని చివర ఉన్న పంటలకు నీరు చేరడంలేదని వాపోతున్నారు. నారు పోసే ముందే కాలువలు శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయాధారిత వీణవంక మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 29 వేల ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. గతేడాది ఉపకాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో వరికి చివరి దశలో నీరు అందక రైతులు నష్టపోయారు. ఈసారి కూడా నష్టపోయే ప్రమాదం వాపోతున్నారు. వీణవంక, జమ్మికుంట, హుజూరాబాద్, శంకరపట్నం మండలాల రైతులకు ఎస్సారెస్పీ నీరే ప్రధానం. ఇక్కడి రైతులకు వరి పంటే ఆధారం.

చర్యలు తీసుకోవాలి

యాసంగిలో 22 వేల ఎకరాల్లో వరి సాగులోకి వస్తుందని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఎల్‌ఎండీ నుంచి మండలానికి డీబీఎం 15, డీబీఎం 6, డీబీఎం 7 కాలువల ద్వారా 16 గ్రామాలకు నీరు అందుతుంది. డీబీఎం 15 కాలువ పరిధిలో బేతిగల్, కనపర్తి, వల్భాపూర్, నర్సింగాపూర్, వీణవంక గ్రామాలున్నాయి. సుమారు రెండువేల ఎకరాలకు నీరందాలి. కానీ దీని పరిధిలో ఉన్న ఉపకాల్వలు అధ్వానంగా ఉన్నాయి. చివరి ఆయకట్టుకు నీరు అందడం కష్టమే అని రైతులు అంటున్నారు. డీబీఎం 6 కాలువ పరిధిలో ఈదే దుస్థితి. అదేవిధంగా తూములు ధ్వంసం కావడంతో కొన్నిచోట్ల నీరు వృథాగా పోతోంది. కొన్నిచోట్ల తూములు లేవని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలని, యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.



శంకరపట్నం: విలువైన పత్రాలు ఉండే రెవెన్యూ అధికారి గది తలుపులు ధ్వంసమైనా మరమ్మతు చేయడం లేదనే విమర్శలు వెలువడుతున్నాయి. విద్యార్థులు సర్టిఫికెట్స్, రైతులు భూసమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తే కొన్ని దరఖాస్తులు లేవని, మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని చెప్పిన సందర్భాలున్నాయి. నెలలు గడుస్తున్నా మరమ్మతు చేయించడం లేదని అధికారులు కొత్త తలుపులు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
- సురేఖ, తహసీల్దార్, శంకరపట్నం సెల్ నం : 83412 18951

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, అదనపు కలెక్టర్

శంకరపట్నం: మండలంలోని తాడికల్, కేశవపట్నం, గద్దపాక కొత్తగట్టు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని, సన్నరకానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కేశవపట్నం రైతువేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తిరుపతి, ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం





ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మ, కేశవపట్నంలో రసమయి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

మానకొండూర్: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రాస్తారోకోతో పాటు రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ నేతలు రసమయి దిష్టిబొమ్మను దహనాన్ని నిరసిస్తూ కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మ దహనం చేశారు. పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనానికి పాల్పడటంతో మానకొండూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. సీఐ బి. సంజీవ్, పోలీసులు రెండు పార్టీల నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

శంకరపట్నం: కేశవపట్న అంబేడ్కర్ చౌరస్తాలో రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. రసమయి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్‌లు తిరుపతి, రాజిరెడ్డి, రాజకొంరయ్య, పద్మ పాల్గొన్నారు.

లెదర్ ఇండస్ట్రీస్ పార్కుల నిర్మాణం చేపట్టాలి

- మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు సురేందర్



రిలే నిరాహార దీక్షలో మాదిగ దండోరా నాయకులు

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లెదర్ ఇండస్ట్రీస్ పార్కులను పునరుత్పాదించాలని మాదిగ హక్కుల దండోర జాతీయ అధ్యక్షుడు సురేందర్ మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్‌మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద లెదర్ పార్క్ సాధన చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఒక్కరోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. చర్మకారులు, దళితుల అభివృద్ధికి లెదర్ పార్కులను ఏర్పాటు చేయడానికి అప్పటి ప్రభుత్వం ఉమ్మడి పది జిల్లాల్లో స్థలాలు కేటాయించారని, కానీ నిర్మాణం చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 శాతం వాటా కింద నిధులు చెల్లించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల కోసం ఐటీఐలో కోర్సుగా ప్రవేశపెట్టి శిక్షణకు ప్రభుత్వ ప్రోత్సాహమందించాలన్నారు. బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డె రాజేంద్రప్రసాద్, చర్మకార సంఘం అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు పోశెట్టి, సంపత్, కొమురయ్య, శ్రీనివాస్, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

గన్నేరువరం: మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన బోయిని జ్యోతి(21) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. డిగ్రీ చదువుతున్న జ్యోతి గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని, ప్రేమ వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి రజిత ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

కారును ఢీకొట్టిన ఆటో

శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్ వద్ద శుక్రవారం కారును ఆటో వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి వీరయ్య(70)కు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ పక్కన కూర్చోగా వీరయ్య కిందపడ్డాడని, 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామడుగు: మండలంలోని మోతె వాగుతో పాటుగా వన్నారం వద్ద వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్సై కె. రాజు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



పోలీసులు పట్టుకున్న బొలెరో వాహనం

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారి ఎ. శ్రీనివాస్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారని, సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

బాధ్యతలు స్వీకరణ



సన్మానిస్తున్న కార్యదర్శులు, అధికారులు

జమ్మికుంట: జమ్మికుంట ఎంపీడీవోగా రావూరి పద్మావతి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ చిగురుమామిడికి బదిలీ వెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శైలజ, ఎంపీవో వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ సదాశివరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీహరి, కార్యదర్శులు, ఏపీవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏవోగా పదోన్నతి



పున్నం చందర్

తిమ్మాపూర్: మండల వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో) పున్నం చందర్‌కు అగ్రికల్చర్ ఆఫీసర్ (ఏవో)గా ప్రమోషన్ లభించింది. కరీంనగర్ కలెక్టరేట్ పరిధిలోని బయోలాజికల్ ల్యాబ్‌లో అగ్రికల్చర్ ఆఫీసర్‌గా నియమిస్తూ సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తిమ్మాపూర్ ఏఈవో బాధ్యతలను తాత్కాలికంగా పర్లపల్లి ఏఈవోకు అప్పగించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, రైతులు పున్నం చందర్‌కు అభినందనలు తెలిపారు

పెంచాల సురేశ్‌కు డాక్టరేట్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెంచాల సురేశ్ డాక్టరేట్ పొందారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగంలో అనలైటికల్ ఫ్రేమ్ వర్క్, పర్ఫార్మెన్స్ అనలైసిస్ ఆఫ్ ఇంటెలిజెంట్ రిఫ్లెక్టింగ్ సర్ఫేస్ ఎయిడెడ్ 6 జీ కమ్యూనికేషన్ సిస్టమ్స్ అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. సురేశ్‌ను మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కార్యదర్శి వి. సతీష్ కుమార్, డైరెక్టర్, డాక్టర్ కె.శంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. ఇంద్రనీల్, రిజిస్ట్రార్ రాజేశ్వరరావు అభినందించారు.

నియామకం

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రీనివాస్ తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి మానకొండూర్ మండల అధ్యక్షుడిగా శుక్రవారం నియామకమయ్యారు. నియామకానికి కృషి చేసిన టీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కూనచుల మహేందర్, ప్రధాన కార్యదర్శి కీసర సంపత్, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం వైఎస్ చైర్మన్ పెసరు కుమారస్వామి, పప్పు సమ్మయ్య, బైక రాజమౌళికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

వీణవంక: మండలంలోని బేతిగల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సురేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4.30 వరకు కరెంట్ సరఫరా ఉండదని, బేతిగల్, వల్భాపూర్ గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

తప్పిన పెనుప్రమాదం



ఇంటిగోడ, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కంటైనర్

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామంలో శుక్రవారం ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి చెందిన కంటైనర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభం, పక్కనే ఉన్న ఇంటి ప్రహరీని ఢీ కొట్టింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని, ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. వైర్లు తెగి లారీ, రోడ్డుపై పడిపోగా విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కంటైనర్, డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రామకృష్ణకాలనీలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీ గౌస్‌ఆలం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధి రామకృష్ణకాలనీలో పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 117 బైక్‌లు, 7 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణా, అమ్మకం, వినియోగం చట్ట విరుద్ధమని, వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ గౌస్ ఆలం హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీమ్, టీ-సేఫ్ యాప్‌ల ప్రాముఖ్యత తెలియజేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు తగ్గుతాయని, విచారణకు బలమైన ఆధారం లభిస్తుందన్నారు. కాలనీ భద్రత కోసం గ్రామ నాయకులు 55 కెమెరాలు ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు. రామకృష్ణకాలనీ జాతీయ రహదారికి పక్కనే ఉన్నందున తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలంటూ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్లు సదన్ కుమార్, బిల్లా కోటేశ్వర్, ప్రదీప్‌కుమార్, శ్రీలత, పుల్లయ్య, సరిలాల్, ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్, అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నాం



వెన్కెపల్లిలో మొక్కజొన్న కల్లం వద్ద రైతులు

సైదాపూర్: మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ధాన్యం దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ.2,400 ధర కంటే రూ.1800 దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చిందని రైతులు ఈరాల శ్రీనివాస్, రజినీకాంత్, మునుపాల శ్రీనివాస్, సంతోష్‌లు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. పంటకోసి వారం అవుతుందని, కొనే నాథుడు లేడని, ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.



వీణవంక: అవగాహన కల్పిస్తున్న వైద్యులు



కేశవపట్నం కేజీబీవీలో..

సీపీఆర్‌పై అవగాహన

హుజూరాబాద్: గుండెపోటుకు గురైన వ్యక్తిని సీపీఆర్‌తో కాపాడవచ్చని ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి పద్మసాయిశ్రీ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు యతపతి అరుణ్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఎర్రొళ్ల రమేశ్, వైస్ ప్రెసిడెంట్, మెడికల్ ఆఫీసర్ తుల సీదాస్ తదితరులున్నారు.

శంకరపట్నం: కేశవపట్నం కేజీబీవీ విద్యార్థులకు సీపీఆర్‌పై 108 ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైనవారికి సీపీఆర్ చేసి బతికించవచ్చన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మాదవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వీణవంక పీహెచ్‌సీ వైద్యులు సీపీఆర్ అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని ఎలా కాపాడాలో ప్రయోగాత్మకంగా వివరించారు. భయాందోళనలకు గురికాకుండా గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేయాలని సూచించారు. ప్రతిరోజు కనీసం 30 నిమిషాలు వాకింగ్, ఆయిల్‌ఫుడ్ తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, వైద్యులు వరుణ, రజనీకాంత్, తేజస్విని, ఆశ వర్కర్లు, గ్రంథపాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు రవీందర్, భాస్కర్, కత్తెరశాల, శోభన్‌బాబు, జయపాల్‌రెడ్డి, కరుణ, కల్పన, శైలజ, స్వప్న ఉన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ హాజరై మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుకు గురైన వ్యక్తిని సీపీఆర్ చేసి ఎలా కాపాడాలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తుల సీదాస్, మేనేజర్ రాజిరెడ్డి, మండల, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్లు మోహన్‌రెడ్డి, పంజాల ప్రతాప్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, సూపర్‌వైజర్ అరుణ, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, పారిశుద్ధ్య జవాన్లు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.